సాక్షి
పెద్దపల్లి
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



చెరువుల కోసం స్థల పరిశీలన

గోదావరిఖని: సింగరేణి నీటిబిందువు.. జలసిందువు' పేరిట చేపట్టిన చెరువుల కోసం ఎన్విరాన్‌మెంట్ జీఎం సైదులు ఆధ్వర్యంలో ఆర్జీ–2లో అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన

గోదావరిఖనిటౌన్: స్థానిక పార్వతీనగర్, మార్కండేయకాలనీలోని అపార్ట్‌మెంట్లలో ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
37.0/27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలిగాలులు వీస్తాయి.

దరఖాస్తుల యువ 'వికాసం'!

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనూహ్య స్పందన
- వరుస సెలవులు, సర్వర్ సమస్యలతో దరఖాస్తులకు ఇబ్బందులు
- చాలా మందికి ఇంకా అందని కులం, ఆదాయం, రేషన్ కార్డులు
- గడువు పెంచాలని దరఖాస్తుదారుల వినతులు

రాజీవ్ యువ వికాసానికి వచ్చిన దరఖాస్తులు

పెద్దపల్లి	రాజన్న సిరిసిల్ల
47,470	23,477
జగిత్యాల	**కరీంనగర్**
31,128	29,000



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాస పథకానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనూహ్య స్పందన వచ్చింది. దరఖాస్తు ప్రక్రియలో తీవ్ర సమస్యలు ఎదురైనా దరఖాస్తులు వెల్లువెత్తాయి. సర్వర్ లోపాలతో పాటు సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగడంతో వేల మంది పథకం కోసం దరఖాస్తు చేసుకోకముందే గడువు ముగియడంతో నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం మెరుగైన రాయితీతో రూ.4 లక్షల వరకు విలువైన యూనిట్లు మంజూరు చేయనుండటంతో యువత ఈ పథకానికి భారీగా దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపారు. గడువు ముగిసేనాటికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,31,075 మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు.

సర్వర్ సమస్యలతో కేంద్రాల వద్ద బారులు

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేయడానికి రూపొందించిన ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో సర్వర్ సమస్యలు నెలకొన్నాయి. దీంతో మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. కొన్నిసార్లు అప్లికేషన్ చివరిదశకు వెళ్లిన సమయంలో సర్వర్ మొరాయించగా, దరఖాస్తు సమర్పించిన తర్వాత అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ కాకపోవడంలాంటి సమస్యలు ఎదురయ్యాయి. ఒకవేళ మళ్లీ దరఖాస్తు చేస్తే అల్రెడీ అప్లైడ్ అని రావడం, దరఖాస్తు సమయంలో తరచూ సర్వర్ ఎర్రర్ మెసేజ్ రావడమనేది పరిపాటిగా మారింది. దీంతో ఒక్కో దరఖాస్తు చేయడానికి కనీసం అరగంటకు పైగా ఎదురుచూడాల్సి వచ్చింది.

సెలవులతో అర్జీలు పెండింగ్‌లో

రేషన్‌కార్డు లేకుంటే ఆదాయ ధ్రువీకరణ ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఆ సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాలకు పరుగులు తీశారు. ఐతే రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తులు స్వీకరించినప్పటి నుంచి వరుస సెలవులు సైతం దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేశాయి. రంజాన్, ఉగాది, జగ్జీవన్‌రామ్ జయంతి, తాజాగా రెండో శనివారం, ఆదివారం, సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆఫీసులు పనిచేయలేదు. దీంతో ఆదాయం, కులం సర్టిఫికెట్లు పెండింగ్ దరఖాస్తులు ఎలా పరిష్కారమవుతాయని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు మీసేవ కేంద్రాల ద్వారా రెవెన్యూ కార్యాలయాలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షల్లో క్యాస్ట్, ఇన్‌కం ధ్రువీకరణ పత్రాలకు అర్జీలు వచ్చాయి. వీటిలో వేలల్లోనే దరఖాస్తులను మాత్రమే అధికారులు ఆమోదించారు. దీంతో ధ్రువీకరణ పత్రాలు అందని చాలామంది యువతీయువకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరేళ్ల తర్వాత

సుమారు ఆరేళ్ల తర్వాత నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని అమలు చేస్తుండంతో యువత దీనిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ పథకం దరఖాస్తుల స్వీకరణ మార్చి 15వ తేదీన ప్రారంభించినప్పటికీ రుణాల పరిమితి, కేటగిరీలు, రాయితీ నిధులకు సంబంధించి స్పష్టత రాలేదు. మార్చి 25వ తేదీన ఈ పథకం విధివిధానాలపై సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. ఆ తరువాత ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ చేపట్టింది. గడువు పెంచుతూ 14 వరకు సమయం ఇచ్చింది. తాజాగా మరోసారి గడువు పెంపుపై ఆశలు పెట్టుకున్నారు.

కుల ధ్రువీకరణ పత్రం లేక దరఖాస్తు తిరస్కరణ



కుల ధ్రువీకరణ పత్రం కోసం వారం రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నా. తహసీల్దార్ కార్యాలయంలో సైట్ ఓపెన్ కావడం లేదని వారు దానిని అప్‌లోడ్ చేయలేదు. దీంతో నాకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ రాలేదు. దీంతో నేను దరఖాస్తు చేసుకోలేకపోయాను. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసే నంబరు వేసినప్పటికీ యువ వికాస పథకంలో తీసుకోవడం లేదు. దీంతో ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వీలు లేకుండా పోయింది.

– ఏదుల కిరణ్‌కుమార్, జగిత్యాల

నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర

- నిర్దేశిత తేమశాతం వచ్చాకే మార్కెట్‌కు తేవాలి
- అన్నదాతలకు కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచనలు



ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్(పెద్దపల్లి): నిర్దేశిత తేమశాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అదనపు కలెక్టర్ వేణుతో కలిసి స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు, రవాణాలో హమాలీ సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కేటాయించిన రైస్ మిల్లులకే ధాన్యం తరలించాలని సూచించారు. గ్రేడ్ ఏ– రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300 మద్దతు ధర చెల్లించాలని అన్నారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీకాంత్, అధికారి రాజేందర్, తహసీల్దార్ రాంచందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, డిప్యూటీ తాహసీల్దార్ మహేశ్, మార్కెట్ కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో 90 రైస్ మిల్లులకే ధాన్యం కేటాయించారని, మిగతా మిల్లులకు కూడా ధాన్యం కేటాయించాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు. అయితే, బకాయి పడిన మిల్లులకు ధాన్యం కేటాయించేది లేదని, బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన వాటికి కేటాయిస్తామని ఆయన వివరించారు. హమాలీ సమస్య పరిష్కరించాలని పలువురు కలెక్టర్‌కు విన్నవించారు.

ఆరోగ్యంగా ఉండండి



శిబిరం ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే విధులు సమర్థవంతంగా నిర్వర్తిస్తారని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా ఆరోగ్య పరిరక్షణ కోసం కాసేపు సమయం కేటాయించాలని ఆయన సూచించారు. నిరంతరం వ్యాయామం, యోగా సాధన చేయడంతోపాటు ఆహారపు అలవాట్లలో మార్పు చేసుకోవాలని సూచించారు. అడిషనల్ అడ్మిన్ డీసీపీ రాజు, స్పెషల్‌బ్రాంచ్, గోదావరిఖని, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, నరసింహులు, మల్లారెడ్డి, ప్రతాప్ తోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అకాలం.. అపార నష్టం



మైదంబండలో ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం



ఓడేడ్‌లో రాలిన మామిడి కాయలు



బేగంపేటలో నేలవాలిన వరి పైరు

- ముత్తారం, ఓదెల మండలాల్లో అకాల వర్షంతో ఆగమాగం
- రెండు వేల ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం
- అన్నదాతకు కన్నీళ్లు మిగిల్చిన వడగళ్ల వాన

ముత్తారం/ఓదెల/రామగిరి: జిల్లాలోని ముత్తారం, ఓదెల, రామగిరి మండలాల్లో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగళ్లవాన కురిసింది. ముత్తారం మండలం ఓడేడ్, ముత్తారం, పారుపల్లి, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, మైదంబండ, మచ్చుపేట, కేశనపల్లి, లక్కారంతో పాటు ఓదెల మండలం పొత్కపల్లి, జీలకుంట, పొత్కపల్లి, ఇందుర్తి, బాయమ్మపల్లె తదితర గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి చేతికి అందే దశలోని వరి పంట నేలవాలింది. ఈసారి అత్యధికంగా సాగైన ఆడ, మగ(సీడ్) పంట నేలపాలు కావడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. బలమైన గాలిదుమారానికి మామిడికాయలు రాలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో బుధవారం సాయంత్రం వరకూ కొన్నిగ్రామాలు అంధకారంలోనే ఉండిపోయాయి. ముత్తారం మండలంలో దాదాపు 11 కరెంట్ స్తంభాలు విరిగి సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ సంతోష్‌రెడ్డి తెలిపారు. వరి పంటను మండల వ్యవసాయాధికారి అనూష, ఏఈవోలు బుధవారం పరిశీలించారు. ముత్తారం మండలంలోని వివిధ గ్రామాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో వరి, 40 ఎకరాల్లో మామిడితోటల నష్టం వాటిల్లిందని ఏవో తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. అదేవిధంగా ఓదెల మండలం పొత్కపల్లి, జీలకుంట, పొత్కపల్లి, ఇందుర్తి, బాయమ్మపల్లె తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లోని వరి పంట దెబ్బతిన్నదని ఏవో భాస్కర్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఓదెల మండలం ఇందుర్తిలోని తాడెటి శ్రీనివాస్‌కు చెందిన ఇల్లు కూలింది. అప్రమత్తమైన శ్రీనివాస్ కుటుంబసభ్యులు వెంటనే బయటకు పరుగెత్తి ప్రాణాలతో బయటపడ్డారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఓదెల మండలం జీలకుంట, బాయమ్మపల్లె, శానగొండ, పొత్కపల్లిలో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాయకులు కొండపాక నర్సింహాచారి, పులి కొమురయ్య, కుక్కల మహేందర్, దాత రాకేశ్‌పటేల్, పుల్ల సదయ్యగౌడ్, అనిల్, కృష్ణ పాల్గొన్నారు. రామగిరి మండలం బేగంపేటలోని రాందేని బక్కయ్యకు చెందిన 5 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



కరీంనగర్ పట్టణంలోని పెట్రోల్‌పంపు వద్ద ప్రయాణప్రాంగణం లేక రోడ్డుపైన చెట్టుకింద బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నీడ లేదు.. నీరూ లేదు..!

కూర్చునేందుకు కుర్చీ ఉండదు.. నిలబడదామంటే నీడ ఉండదు.. కనీసం తాగునీరు దొరకదు.. అత్యవసర పరిస్థితుల్లో మరుగుదొడ్లను వినియోగించుకుందామంటే ముక్కుపుటాలు అదిరే కంపు.. ఇవీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో కనిపించే పరిస్థితులు. నియోజకవర్గ కేంద్రాల్లో బస్టాండ్లు ఉన్నా సౌకర్యాలు లేకపోగా.. మండల కేంద్రాల్లో కనీసం బస్టాండ్లు కూడా కరువయ్యాయి. మరికొన్ని ప్రధాన గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. వీరంతా ఎండలోనే నిల్చొని బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. అంటూ ప్రచారం చేసుకునే అధికారులు ప్రయాణ ప్రాంగణాలలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఉమ్మడి జిల్లాలో ప్రయాణ ప్రాంగణాలు లేక.. ఉన్నా సౌకర్యాలు కరువై ప్రయాణికులు పడుతున్న కష్టాలపై 'సాక్షి' ఫోకస్. – వివరాలు 8లో..

న్యూస్‌రీల్

యూడైస్ ప్లస్ పునఃపరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న విద్యార్థిని మాసుమా

జ్యోతినగర్(రామగుండం): విద్యా వ్యవస్థను బలోపేతం చేసేక్రమంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన యూడైస్ ప్లస్ పరిశీలన కార్యక్రమం ప్రారంభమైంది. బుధవారం ఎన్టీపీసీ సుభాష్‌నగర్ పాఠశాలను కరీంనగర్ డైట్ కళాశాల విద్యార్థిని మాసుమా రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్, మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, తరగతి గదుల సంఖ్య, మూత్రశాలలు తదితర అంశాలపై ఆరా తీస్తున్నామన్నారు. నివేదికను యూడైస్‌లో పొందుపరిచిన ఆ తర్వాత మార్పులు, చేర్పుల గురించి హెచ్‌ఎం శారదకు వివరించారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రామ్‌కుమార్ ఉన్నారు.

లెక్చరర్ల ఇంటింటి ప్రచారం



అవగాహన కల్పిస్తున్న లెక్చరర్లు

రామగుండం: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు బుధవారం ఇంటింటా పర్యటించారు. అంతర్గాం మండలం పొట్యాల, మద్దిర్యాల తదితర గ్రామాల్లో ప్రిన్సిపాల్ చింతల మోహన్ ఆదేశాల మేరకు లెక్చరర్లు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని గ్రూపులు, వసతులు, నిష్ణాతులైన అధ్యాపకులు తదితర అంశాల గురించి వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించాలని కోరారు.

30లోగా దరఖాస్తు చేయాలి

పెద్దపల్లిరూరల్: 'టెట్' కోసం ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మాధవి తెలిపారు. ఇందుకోసం అభ్యర్థులు https://tgtet.aptonline.in/tgtet/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని డీఈవో సూచించారు.

ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం తెలిపారు. సన్నరకం ధాన్యం క్వింటాల్ రూ.500 బోనస్ వర్తింపజేస్తామన్నారు. ఐకేపీ, ప్యాక్స్‌లు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు గోనె సంచులు, లారీల ట్రాన్స్‌పోర్ట్ విషయంలో ఇబ్బందులు ఉంటే 7995050780 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కంట్రోల్‌రూమ్ ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తుందని, రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే కంట్రోల్ రూమ్‌నంబర్ 08728–224045కు ఫోన్‌చేసి ఫిర్యాదు అందించాలని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన 'సబార్డినేట్' పరీక్షలు

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూలో బుధవారం జ్యుడీషియల్, మినిస్టీరియల్, సబార్డినేట్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం ఈ పరీక్షలు నిర్వహించారని అధికారులు తెలిపారు. ఉదయం వేళ 100 మందికి 67 మంది హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన పరీక్షకు 56 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు చేపట్టారు.

నేటి నుంచి 'భూ భారతి'పై సదస్సులు

పెద్దపల్లిరూరల్: భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన భూ భారతి(ఆర్‌వోఆర్) చట్టంపై ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 17న అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి, ఎన్టీపీసీ టీటీఎస్ మిలీనియం హాల్, 19న ధర్మారం మండలం నందిమేడారం, 21న ఎలిగేడు మండలం ఎలిగేడు, జూలపల్లి మండలం గోల్డెన్ ఫంక్షన్‌హాల్, 22న రామగిరి మండలం సెంటినరీకాలనీ సింగరేణి కమ్యూనిటీహాల్, కమాన్‌పూర్ మండలం నాగారం, 23న మంథని మండలం నాగారం, 24న ఓదెల మండల కేంద్రం, ముత్తారం తహసీల్దార్ కార్యాలయం, 25న పాలకుర్తి మండలం పాలకుర్తి, కాల్వశ్రీరాంపూర్ రెడ్డి ఫంక్షన్‌హాల్, 26న సుల్తానాబాద్ మండలం సుద్దాల, 28న పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రోజూ ఉదయం 10.00 గంటలకు ఒకటి, మధ్యాహ్నం 2.00 గంటలకు మరో అవగాహన సదస్సు ఉంటుందన్నారు.

చెప్పుకోలేని బాధలకు పరిష్కారం లేదా?

- కమాన్‌చౌరస్తా, జెండా కూడలిలో మూత్రశాలలు లేవు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టణవాసులు, చిరువ్యాపారులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పెద్దపల్లి కమాన్‌చౌరస్తా ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్ సౌకర్యం లేదు.. పట్టణవాసులతోపాటు వివిధ పనుల కోసం వచ్చే సమీప గ్రామస్తులు ఒకటి, రెంటికి అవస్థలు పడుతున్నారు.. ఒప్పందం చేసుకుని ఏళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించడం లేదు.. గత్యంతరం లేక నేను నిరసన తెలియజేయాల్సి వస్తోంది..

– అప్పటి కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఇలా ప్రస్తావించాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.



ఇది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో మున్సిపల్ అధికారులు నిర్మించిన టాయిలెట్. షెడ్డు శిథిలమైందనే కారణంతో కొన్నేళ్లక్రితం మూసివేశారు. సిమెంట్, ఇటుకలతో నిర్మిస్తామంటూ నెలల తరబడి జాప్యం చేస్తున్నారు.

పెద్దపల్లిరూరల్: అసలే జిల్లా కేంద్రం.. పట్టణంతో పాటు సమీప గ్రామీణులు వివిధ అవసరాల కోసం రోజూ ఇక్కడకు వచ్చిపోతుంటారు. ఒకటి, రెంటికి పబ్లిక్ టాయిలెట్లు లేక ఉక్కబట్టుకుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే కమాన్ చౌరస్తా, జెండా చౌరస్తాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

మహిళల బాధ చెప్పుకోలేనిది..

తమ అవసరాల కోసం పెద్దపల్లికి వచ్చే పరిసర మండలాలు, గ్రామాల ప్రజలు మల, మూత్రవిసర్జనకు నానాతిప్పలు పడుతున్నారు. మహిళల బాధలు వర్ణనాతీతం. పట్టణంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌కు సమీపంలో (సాగర్‌రోడ్డువైపు) నిర్మించిన పబ్లిక్ టాయిలెట్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే చిరువ్యాపారులు, కూరగాయలు, పండ్లు అమ్ముకునే రోజువారీ వ్యాపారులు పొద్దంతా శ్రమించి సంపాదించిన సొమ్ములో రూ.20 నుంచి రూ.30 వరకు మల, మూత్రవిసర్జనకే వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. మూత్రవిసర్జనకు డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులతో కొందరు వాగ్వాదానికి దిగుతున్నారు. సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద 'మూత్రవిసర్జన ఉచితం' అనే బోర్డు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

స్థలం అందుబాటులో లేకనే..

పట్టణంలోని కమాన్ ప్రాంతంలో గల పెట్రోల్ బంకు వద్ద సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని గతంలో తీర్మానించారు. అక్కడ పనులు ప్రారంభించకున్నా కనీసం సమీపంలో మరోచోట కూడా పబ్లిక్ టాయిలెట్ నిర్మించలేకపోయారు. దీంతో ఈ ప్రాంతానికి వచ్చిన వారంతా మూత్ర, మల విసర్జనకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మహిళలు గోస పడుతుండ్రు



వివిధ పనుల నిమిత్తం పెద్దపల్లికి వచ్చేవారికి కనీస సౌకర్యాలు లేవు. మల, మూత్రవిసర్జనకు పడుతున్న బాధలు అన్నీఇన్నీకాదు. ముఖ్యంగా పల్లెల నుంచి వచ్చిన మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కమాన్ ప్రాంతంలో సులభ్‌కాంప్లెక్స్ నిర్మించాలి.

– జ్యోతి, సీఐటీయూ నాయకురాలు

అధికారులు చొరవ చూపాలి



జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలోని ప్రధాన కూడళ్లలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి. మూత్రవిసర్జన కోసం కనీస ఏర్పాట్లు చేయాలి. కమాన్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ చూపి సులభ్‌కాంప్లెక్స్ నిర్మించాలి.

– కనుకుంట్ల సదానందం, సామాజిక కార్యకర్త

స్థలం అందుబాటులో లేదు



పెద్దపల్లిలో మరోరెండు పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాల్సిన అవసరముంది. ఇందుకోసం నిధులు ఉన్నాయి. స్థలమే లభించడం లేదు. కమాన్ ప్రాంతంలోని పెట్రోల్ బంక్ టాయిలెట్లను వినియోగించుకోవచ్చు. ఈ మేరకు నిర్వాహకులకు తగిన సూచనలు ఇచ్చాం.

– ఆకుల వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, పెద్దపల్లి

క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రామడుగు: రామడుగు, షానగర్ సరిహద్దుల్లోని తాటివనంలో రామడుగు గ్రామానికి చెందిన కావలి భూమయ్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భూమయ్య కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. భార్య, పిల్లలు వదిలివెళ్లారని, దీంతో మంగళవారం రాత్రి గ్రామ పరిసరాల్లోని తాటివనంలో ఉరేసుకున్నట్లు తెలిపారు. గీత కార్మికులు పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: అతివేగం, నిర్లక్ష్యంతో లారీని నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలో నివాసం ఉంటున్న నాగులమల్యాల రాజేశం(59) కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. మధ్యాహ్నం పనినిమిత్తం కూనారం రోడ్డు నుంచి బస్టాండ్ వైపు టీవీఎస్ ఎక్స్ఎల్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీడ్రైవర్ వెనుక నుంచి ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజేశం మృతి చెందినట్లు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య విజయతోపాటు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు.

ఎన్టీపీసీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ ఆవరణలో నిర్మించిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజ్–1లోని రెండో యూనిట్‌లో వార్షిక మరమ్మతులు చేపట్టారు. దీనికోసం మంగళవారం అర్ధరాత్రి ప్రాజెక్టులోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండోయూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. వారంరోజుల పాటు మరమ్మతులు కొనసాగనున్నట్లు సమాచారం.

బీసీసీఐకి ఫిర్యాదు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాల్లో క్రికెట్ క్రీడ కుంటుపడుతుందని, క్రికెట్ క్రేజ్ కేవలం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మాత్రమే దక్కుతుందని, బీసీసీఐ (బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా) నివేదించిన ఉత్తర్వులను హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) అమలుచేయడంలో విఫలమైందని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెలిచాల ఆగం రావు తెలిపారు. నిధులు, అభివృద్ధి, తదితర కార్యకలాపాలు రాష్ట్రంలో సైతం కొనసాగించాలని ఆయన ఈనెల 8న బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించగా ఈనెల 15న బీసీసీఐ అపెక్స్ కమిటీకి నివేదించినట్లు ఆగంరావు తెలిపారు. రాష్ట్రంలోని హెచ్‌సీఏ జిల్లాలకు చేస్తున్న అభివృద్ధిపై నివేదిక సమర్పించాలని కోరామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రికెట్ ప్రోత్సాహానికి బీసీసీఐ నిధులు కేటాయించినప్పటికీ, హెచ్‌సీఏ రాష్ట్రంలోని జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధిని విస్మరించింది. 2018, 2021లో జారీచేసిన బీసీసీఐ ఆదేశాలు, సిఫార్సులకు విరుద్ధంగా హెచ్‌సీఏ వ్యవహరించిందన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. దీక్షాపరులు, భక్తులు ఆలయ సమీపంలోని కోనేరులో స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. కొండగట్టు హనుమాన్ చిన్న జయంతిని పురస్కరించుకొని, కొండగట్టు ఆంజనేయస్వామిని సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లోని తలనీలాలు, దుస్తులు, చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు.





సిరిసిల్ల పాత బస్టాండులో నీడలేని ప్లాట్‌ఫామ్స్

నీడ లేదు.. నీరూ లేదు..!

- అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్‌లు, షెల్టర్లు
- ప్రయాణికులకు ఎండ కష్టాలు
- తాగడానికి నీరులేదు.. ఒంటికి, రెంటికి తిప్పలే

- కరీంనగర్ స్మార్ట్‌సిటీలో బస్‌షెల్టర్లు నామమాత్రం. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు ఎదురుగా మానకొండూరు, తిమ్మాపూర్, బెజ్జంకి, కమాన్ ప్రాంతంలో ఉన్న నిలువనీడ కరువయ్యింది. కోర్టు ఎదురుగా చొప్పదండి , పెద్దపల్లికి వెళ్లే రూట్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో జనం ఎండలో నిలబడుతున్నారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం, సహా ఇల్లంతకుంట, గంభీరావుపేట, కోనరావుపేట, బోయినపల్లిలో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. పలుగ్రామాల్లో బస్సులు నిలిపే స్థలం , బస్సుషెల్టర్లు లేవు. జిల్లా కేంద్రంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. పట్టణానికి దూరంగా ఉన్న కొత్తబస్టాండ్‌లో ప్రయాణికులు నామమాత్రంగా వెళ్తుంటారు. పాతబస్టాండ్ ఏరియానే నిత్యం వందలాది మందితో కిటకిటలాడుతోంది. ఇక్కడ ప్లాట్‌ఫామ్స్‌పై నిలువనీడలేదు. ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ బస్సుల కోసం నీరిస్తున్నారు. ఇల్లంతకుంటలో తాగునీటి వసతిలేదు. మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. కోనరావుపేట, గంభీరావుపేటలో ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా ఉంది. ప్రయాణికులు బస్సుల కోసం దుకాణాల నీడలో నిలబడుతున్నారు.
- జగిత్యాల జిల్లా రాయికల్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లిలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. రాయికల్ పాతబస్టాండ్‌లో కూర్చునేందుకు, నీడలేదు. ఇబ్రహీంపట్నంలో బస్ షెల్టర్ల వద్ద బస్సులు ఆపడం లేదు. దీంతో ప్రయాణికులు రోడ్లపై నిలబడుతున్నారు. తాగునీటి వసతీ లేదు. పెగడపల్లిలో తాగునీరు కరువైంది. ఉన్న టాయిలెట్స్ సరిగాలేవు. కథలాపూర్‌లో కనీస వసతులు లేవు. టాయిలెట్ కోసం దూరప్రాంతానికి వెళ్లాల్సి వస్తోంది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌లో ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో నిరీక్షిస్తున్నారు. కరీంనగర్–గోదావరిఖని రాజీవ్ రహదారిలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నారు. బొమ్మకల్, చల్మెడ ఆనందరావు ఆస్పత్రి, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, మొగ్దుంపూర్ గ్రామాల స్టేజీలపై బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండలోనే నిరీక్షిస్తున్నారు.

> ఓ వైపు ఎండలు మండుతున్నాయి. ఎండవేడిమికి జనం నానా అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి కష్టాలు వర్ణనాతీతం. చంటిపిల్లల తల్లులు, మహిళలు, వృద్ధులు పడరానిపాట్లు పడుతున్నారు. బస్సుల కోసం ఎదురు చూడడం.. వేసవి తాపం.. గొంతు తడుపుకోవడానికి కనీసం నీటివసతి కరువు. డీహైడ్రేషన్.. బస్టాండ్, బస్టాపుల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక నరకం అనుభవిస్తున్నారు.



ఇల్లంతకుంట బస్టాండ్‌లోని పురుషుల మరుగుదొడ్డి



కాల్వశ్రీరాంపూర్ బస్టాండ్‌లో పైకప్పులేని బస్ షెల్టర్



కాల్వశ్రీరాంపూర్‌లో చెట్ల నీడన బస్ కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



గంభీరావుపేట: ఎండలో నిల్చుని బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



వెంకట్రావుపల్లి చౌరస్తాలో ఎండలో బస్సుల కోసం నిల్చున్న ప్రయాణికులు

– సిరిసిల్లటౌన్/ గంభీరావుపేట/ కోనరావుపేట/బోయినపల్లి/రాయికల్/ కథలాపూర్/కాల్వశ్రీరాంపూర్/పెగడపల్లి



సిరిసిల్ల పాత బస్టాండులో ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్



కోనరావుపేటలో నిరుపయోగంగా మారిన ప్రయాణ ప్రాంగణం



చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఎదుట ఎండలో నిలుచున్న ప్రయాణికులు

జీజీహెచ్‌లో పనిచేయని ఫ్రీజర్లు

- యంత్రాంగం తీరుపై నిరసన

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో బాడీ ఫ్రీజర్లు పనిచేయడం లేదు. మార్చురీలో మూడు ఫ్రీజర్లు ఉండాల్సి ఉండగా, ఒకటే పనిచేస్తోంది. మిలిగిన రెండు పనిచేయడం లేదు. దీంతో ఎక్కువ సంఖ్యలో మృతదేహాలు మార్చురీకి వచ్చినప్పుడు వాటిని ఫ్రీజర్‌లో పెట్టేందుకు అవకాశం లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బందితోపాటు మృతుల కుటుంబాలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం రాత్రి ప్రత్యూష అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం పోస్టుమార్టం చేయాల్సి ఉంది. దీంతో ఆ మృతదేహాన్ని మార్చురీలో ఉంచడానికి వన్‌టౌన్ పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. సోమవారం రాత్రి రైలు ప్రమాదంలో మృతి చెందిన ఓ యువకుడి మృతదేహాన్ని పని చేస్తున్న ఫ్రీజర్‌లో పెట్టి ఉంచడంతో ఆస్పత్రి సిబ్బంది ఏం చేయలేమని చేతులెత్తేశారు. దీంతో యువతి మృతదేహం పాడవకూడదని భావించిన మృతురాలి తండ్రి విఠల్.. డబ్బులు వెచ్చించి అద్దెకు ఫ్రీజర్‌బాక్స్ తెప్పించి అందులో తన కూతురు మృతదేహాన్ని పెట్టాల్సి వచ్చిందని ఆవేదనతో తెలిపాడు. బోధన ఆస్పత్రిగా అభివృద్ధి చెందుతున్న జీజీహెచ్‌లో అన్నివసతులు కల్పిస్తున్నామని చెబుతున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేయని ఫ్రీజర్లపై అనేక ఫిర్యాదులు వచ్చినా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మార్చురీలో పనిచేయని ఫ్రీజర్లు

ప్రజాస్వామ్యంలో ప్రెస్ ఫోర్త్ ఎస్టేట్

- పాత్రికేయులు ప్రజాసేవకులు
- కరోనా తర్వాత పాత్రికేయరంగం మారింది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ప్రెస్ అకాడమీ చైర్మన్‌తో కలిసి ప్రెస్‌క్లబ్ సమావేశ మందిరం ప్రారంభం

వేములవాడ: ప్రజాస్వామ్యంలో ప్రెస్ ఫోర్త్ ఎస్టేట్‌గా ఉంటూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధులుగా పనిచేస్తున్నారని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రెస్‌క్లబ్‌లోని సమావేశ మందిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు పాత్రికేయ మిత్రులతో 1987 నుంచి అనుబంధం ఉందని, ఒకప్పుడు రుద్రంగి నుంచి వేములవాడకు వచ్చి వార్తలు అందించిన మిత్రులు ఉన్నారని గుర్తు చేసుకున్నారు. సోషల్ మీడియాతో మంచి, చెడు రెండు ఉంటున్నాయన్నారు. త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే వేములవాడ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏఐతో పొంచి ఉన్న ముప్పు

– ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పత్రికరంగంలో మార్పులు వస్తూనే ఉన్నాయని.. ప్రింట్ నుంచి ఎలక్ట్రానిక్.. ఆతర్వాత సోషల్ మీడియా వచ్చిందని.. ఇప్పుడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)తో మరింత ముప్పు పొంచి ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రధాని, ఆర్థికశాఖ మంత్రి మాట్లాడినట్లు వీడియోలు వైరల్ చేస్తూ హైరానా సృష్టించిన విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏఐ, దాని పరిణామాలపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లో శిక్షణ తరగతులు నిర్వహించామని, త్వరలోనే వేములవాడలో రెండు రోజులపాటు శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బీజేయూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ వేములవాడ ప్రెస్‌క్లబ్ ముందు నుంచి అన్ని రంగాల్లో ముందుందన్నారు. ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేశ్, అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, కార్యదర్శి మహేశ్, కార్యవర్గ సభ్యులు, పాత్రికేయులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్ మీటింగ్ హాల్‌ను పారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ప్రెస్ అకాడెమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

‘భట్టి’ని కలిసిన కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తదితరులు

గోదావరిఖని: డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్(డీఎంఎఫ్‌టీ) నిధులు విడుదల చేయాలని కోరుతూ కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయనను కలిసి లేఖ అందజేశారు. కోల్‌బెల్ట్ ప్రాంత అభివృద్ధికి నిధులు త్వరగా విడుదల చేయాలన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో మైనింగ్‌తో ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, రహదారి, ఆరోగ్య శిబిరాలు, విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ఈనిధులు ఎంతగానో తోడ్పతాయని అన్నారు. ఇప్పటికే నిధులు మంజూరైనా విడుదల విషయంలో ఆలస్యం జరుగుతోందన్నారు. డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. ప్రత్యేకంగా మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ ప్రాధాన్యత, సంబంధిత శాఖలతో చర్చించి, త్వరితగతిన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజ్‌ఠాకూర్, గంట సత్యనారాయణ, బీర్ల ఆయిలయ్య తదితరులు ఉన్నారు.

ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో యువతి ఆత్మహత్య



ప్రత్యూష(ఫైల్)

గోదావరిఖని: ఎంకాం చదివి ఎన్ని పరీక్షలు రాసినా ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో పీజీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై భూమేశ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీకి చెందిన చుంచు ప్రత్యూష(26) బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉన్నత చదువులు చదవి ఎన్ని పరీక్షలు రాసినా ఉద్యోగం రావడం లేదని కొంతకాలంగా మదనపడుతోంది. ఇదేవిషయాన్ని ఇంట్లో చెబుతూ బాధపడుతుండేది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో రేకులషెడ్డు పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉద్యోగం రాలేదని తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై తన మూడో కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి చుంచు విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

జీజీహెచ్‌లో అనుమానాస్పద శిశువు?

- అపస్మారకస్థితిలో శిశువును పట్టుకొచ్చిన వ్యక్తులు
- విచారణ చేపట్టిన గోదావరిఖని పోలీసులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కు గుర్తుతెలియని వ్యక్తులు వారం క్రితం జన్మించిన ఓ అపస్మారకస్థితిలోని మగ శిశువును తీసుకొచ్చిన ఘటన కలకలం సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. చికిత్స కోసం తీసుకొచ్చిన వ్యక్తులు.. శిశువు జననం, తల్లిదండ్రులు, పుట్టిన ప్రాంతంపై వివరాలు వెల్లడించడంలో పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వైద్య సిబ్బంది అనుమానంతో స్థానిక వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రాపూర్ నుంచి వచ్చారని తెలియడంతో తొలుత శిశువులను తరలించే ముఠాగా భావించి అందరినీ అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది.

అపస్మారక స్థితిలో శిశువు

అపస్మారకస్థితిలో ఉన్న శిశువును తొలుత గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో జీజీహెచ్‌కు తరలించారు. డ్యూటీలో ఉన్న పిల్లల వైద్యనిపుణులతోపాటు నర్సింగ్ ఆఫీసర్లు రిస్క్ తీసుకొని మెరుగైన వైద్యం అందించడంతో శిశువు కోలుకుంది. ప్రస్తుతం ఎస్ఎన్‌సీయూ విభాగంలో శిశువుకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ విషయంపై వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డిని వివరణ కోరగా, లీగల్‌గా దత్తత తీసుకోవడానికి ప్రొసీజర్ తెలియక నోటరీ చేసుకొని శిశువును దత్తత తీసుకోవడాదనికి వచ్చినట్లు తెలిపారని, ఈలోగా శిశువు అపస్మారకస్థితిలో ఉంటే ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారని తెలిపారు. శిశువు తల్లిదండ్రులను కూడా విచారించామని, ఇష్టపూర్వకంగానే లీగల్‌గా దత్తతకు ఇస్తున్నామని తెలిపారని, ప్రస్తుతం శిశువును ఐసీడీఎస్ పర్యవేక్షణలో ఉంచినట్లు సీఐ వెల్లడించారు.

వైద్య కళాశాలకు దేహదానం



ఓదెలు పార్థివశరీరాన్ని అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

ఓదెల/సుల్తానాబాద్(పెద్దపల్లి): కొలనూర్ గ్రామానికి చెందిన జీగురు ఓదెలు అనారోగ్యంతో చనిపోయారు. ఆయన పార్థివదేహాన్ని బుధవారం కరీంనగర్ ప్రతిమ మెడికల్ కాలేజీకి అప్పగించారు. తొలుత మృతుడి నివాసంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ సమక్షంలో సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్, సుల్తానాబాద్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మృతుడి కుమారులు జీగురు నాగయ్య, ఐలయ్య, రవీందర్, రాంచందర్ నేతృత్వంలో పార్థివదేహాన్ని ప్రతిమ మెడికల్ కాలేజీ నిర్వాహకులకు అప్పగించారు. మృతుడి భార్య జీగురు కనకలక్ష్మి సైతం గతంలో శరీరదానానికి అంగీకరించారు. ఈకార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయండి

- సైనిక్‌స్కూల్ మంజూరు చేయండి
- కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, గజేంద్ర సింగ్ షెకావత్‌లకు బండి సంజయ్ వినతి

కరీంనగర్‌టౌన్: వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రాంతాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ (ఎస్‌ఏఎస్‌సీఐ) పథకం కింద నిధులను మంజూరు చేయాలని విన్నవించారు. సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాల్లో సైనిక్‌స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు విన్నవించారు. ఈమేరకు న్యూఢిల్లీలో బుధవారం కలిసి వినతిపత్రాలు అందించారు. కేంద్రం సైనిక్‌స్కూల్‌ను మంజూరుచేస్తే భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.



కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్‌కు బొకె అందజేస్తున్న బండి సంజయ్

అభివృద్ధి పనుల పరిశీలన



వివరాలు సేకరిస్తున్న డీఆర్డీవో కాళిందిని

ఎలిగేడు(పెద్దపల్లి): ఉపాధిహామీ ద్వారా ధూళికట్ట గ్రామంలో చేపట్టిన మట్టి రోడ్డు పనులను డీఆర్డీవో కాళిందిని బుధవారం పరిశీలించారు. నిర్మాణం తీరు, ఉపాధిహామీ కూలీలకు కల్పించి తాగునీరు, నీడ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం, తేమశాతం తనిఖీ చేశారు. ఎలిగేడు, సుల్తాన్‌పూర్ గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిచారు. ఈకార్యక్రమంలోఎంపీడీవో భాస్కర్‌రావు, టీ సెర్ప్ ఏపీఎం సుధాకర్, ఈజీఎస్ ఏపీవో సదానందం, సీసీలు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.